# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 253 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 20 ఆగస్టు 2026 | పేజీలు :4




24న మహాకాళి
ఫస్ట్ గ్లింప్స్
4

# రైతులకు సకాలంలో రుణాలు అందాలి

3

- బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి
- వారి ఆదాయం పెంచడంలో భాగస్వామ్యం కావాలి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన






# రాష్ట్రంలో అరాచక పాలన

- మాజీ మంత్రి దయాకర్ రావు
- నర్సంపేట బంద్‌కు వెళ్తుండగా ఎర్రబెల్లి అరెస్ట్.. ఆపై విడుదల

**జనగామ, మన చౌరాస్తా :** నర్సంపేట బంద్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును జనగామ పోలీసులు బుధవారం మధ్యాహ్నం నెల్లుట్ల బైపాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశారు. అనంతరం ఆయనను జనగామ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల చర్యకు నిరసనగా రోడ్డుపై ఆందోళన తెలిపేందుకు దయాకర్ రావు ప్రయత్నించగా, అధికారులు ఆయనకు నచ్చజెప్పారు. ఎలాంటి పూర్వ సమాచారం లేదా నోటీసులు ఇవ్వకుండా రాత్రికిరాత్రే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం దురదృష్టకరమని ఆయన ఈ సందర్భంగా వాపోయారు. ఎర్రబెల్లి దయాకర్ రావు అరెస్ట్ వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జనగామ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. పరిస్థితిని సమీక్షించిన అనంతరం పోలీసులు ఆయనను స్వల్ప వ్యవధిలోనే విడుదల చేశారు. విడుదల అనంతరం దయాకర్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నేను గత 40 ఏళ్లుగా రాజకీయాలో ఉన్నాను, ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో నాపై ఎలాంటి మచ్చ లేదు. నర్సంపేటలో పోలీసుల చర్యతో ఆందోళన చెందుతున్న పార్టీ కార్యకర్తలకు ధైర్యం చెప్పేందుకు వెళ్తుంటే నన్ను అడ్డుకుని అరెస్ట్ చేయడం ఏంటి?" అని ఆయన ప్రభుత్వాన్ని, పోలీసుల తీరును ప్రశ్నించారు.








# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



**జనగామ, మన చౌరాస్తా :** ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లోని వ్యత్యాసాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై, పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి, అలాగే అక్టోబర్ 15 వరకు నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో చేపడుతున్న చర్యలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, రాష్ట్ర స్థాయికి పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్లకు సూచించారు. ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. నోటీసుల జారీ, క్లెయిమ్‌లు-అభ్యంతరాల పరిష్కారం వంటి ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ధ్రువపత్రాల స్వీకరణకు తేదీ, సమయాలను ముందుగా ఖరారు చేయాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ ఆదాయం పెంచాలి

**జనగామ మున్సిపాలిటీ అభివృద్ధి, పౌర సేవలపై కలెక్టర్ సమీక్ష**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు ఆదాయ వనరులను పెంచేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపాలిటీకి సంబంధించిన వివిధ విభాగాల పనితీరుపై ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి ఉన్న ఆదాయ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సులతో పాటు పన్నుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి మున్సిపాలిటీని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పారిశుద్ధ్య పనులను పూర్తిస్థాయిలో మ్యాపింగ్ చేసి వార్డుల వారీగా రూట్ మ్యాప్‌లను మున్సిపాలిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇళ్ల సంఖ్య, జనాభా నిష్పత్తికి అనుగుణంగా సిబ్బందిని కేటాయించి, స్వచ్ఛ ఆటోలు మరియు ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. వ్యాపారులు, దుకాణాదారులు చెత్తను రోడ్లపై వేయకుండా అవగాహన కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, మున్సిపల్ సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, వారి విధుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. అర్హత కలిగిన జవాన్లకు అవసరమైన చోట శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అదనపు బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణ అనుమతుల విషయంలో ప్రభుత్వ నిబంధనలను పక్కాగా పాటించాలని, నిర్ణీత గడువులోగా అనుమతులు జారీ చేయడంతో పాటు అనుమతి లేని నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. జననమరణ ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులను సకాలంలో అందించాలని, ప్రజలు కూడా సమయానికి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ శాఖ మేనేజర్ ప్రభాకర్, డీఈ రాజ్‌కుమార్, వార్డు అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# ముగిసిన జిల్లాస్థాయి రోప్ స్కిప్పింగ్ ఎంపిక పోటీలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సేజ్ హై స్కూల్ ప్రాంగణంలో బుధవారం జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వయస్సు విభాగాలు మరియు స్పీడ్ స్పిరిట్ విభాగాలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు విజేత బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 23న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జనగామ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేజ్ హై స్కూల్ కరస్పాండెంట్ వాదిరెడ్డి రోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రోప్ స్కిప్పింగ్ క్రీడ ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ, సమన్వయం మరియు ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలని పిలుపునిచ్చారు.

**విజయం సాధించిన క్రీడాకారులు**

- అండర్8 బాలికలు: ప్రథమ - డి. మనస్వి, ద్వితీయ - ఎం. ఇషిత, తృతీయ - జి. రిషిధర్
- అండర్10 బాలురు: ప్రథమ - ఆగమనరాజ్, ద్వితీయ - తనిష్
- అండర్10 బాలికలు: ప్రథమ - ఉజ్వల, ద్వితీయ - ప్రతిక్ష, తృతీయ - ధన్యత
- అండర్12 బాలురు: ప్రథమ - మనీవార్, ద్వితీయ - వినయ్
- అండర్12 బాలికలు: ప్రథమ - అమూల్య, ద్వితీయ - సాక్షిత, తృతీయ - ప్రజ్వ
- అండర్14 బాలురు: ప్రథమ - ఈశ్వర్, ద్వితీయ - వర్షిత్, తృతీయ - మోహిత్
- అండర్14 బాలికలు: ప్రథమ - ప్రణీత, ద్వితీయ - తారక, తృతీయ - వర్షిత, అక్షయ
- అండర్17 బాలురు: ప్రథమ - బి. శరత్, ద్వితీయ - ధనుష్, తృతీయ - క్రిష్ బాబు
- అండర్17 బాలికలు: ప్రథమ - వైష్ణవి, ద్వితీయ - సాహితీప్రియ

**స్పీడ్ స్పిరిట్ విభాగంలో విజేతలు :** అండర్ 17 బాలికల్లో సాహితీప్రియ, వైష్ణవి; బాలుర విభాగంలో ధనుష్, శరత్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అండర్14 విభాగార్థుల్లో అక్షయ (బాలికలు), వర్షిత్ (బాలురు) ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారు. అండర్12 విభాగంలో కోమలి (బాలికలు), అభినవ్ (బాలురు) విజేతలుగా నిలవగా, అండర్10 బాలికల విభాగంలో వి. రేమానిక రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు.

ఈ కార్యక్రమంలో రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు ఆరుట్ల శోభ, ప్రెసిడెంట్ పాలమాకుల కుమార్, చైర్మన్ బొల్లం మణికంఠ (అజయ్), ఆర్గనైజింగ్ సెక్రటరీ, సేజ్ హై స్కూల్ కరస్పాండెంట్ వాదిరెడ్డి రోహన్ రెడ్డి, కోచ్‌లు, పిఇటిలు, పాఠశాల యాజమాన్యం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పొగాకును పక్కాగా నియంత్రించాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** పొగాకు నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పొగాకు నివారణ, న్యాకో కార్యక్రమాలపై డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా కమిటీ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయడం నేరమని, ఈ నియమాన్ని ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల వినియోగం, విక్రయాలపై నిఘా పెంచాలన్నారు. పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించి, కోట్పా యాక్ట్ ను కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. హెచ్ఐవి పరీక్షలను విరివిగా చేపట్టి, ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించి, తద్వారా హెచ్ఐవి రహిత జిల్లాను నిర్మించాలని సూచించారు. హెచ్ఐవి/ఎయిడ్స్/ ఎస్టిఐలపై తీవ్రతర ఐఇసి ప్రచార కార్యక్రమానికి సంబంధించిన QR Scan code మెటీరియల్ ను వారు ఆవిష్కరించారు. సమావేశంలో డిఎంహెచ్వో డాక్టర్ వాణి శ్రీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, పీఓఎన్సీడి డాక్టర్ సిద్ధార్థ రెడ్డి, డిఎస్ఓ డాక్టర్. శ్రావ్య, న్యాకో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# రైతుకు సకాలంలో రుణాలు అందాలి

- బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి
- వారి ఆదాయం పెంచడంలో భాగస్వామ్యం కావాలి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి సూచన



**హైదరాబాద్, మన చౌరాస్తా :** అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.



# కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

- రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆమోదం

**న్యూఢిల్లీ, మన చౌరాస్తా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్‌లో రహదారి ప్రాజెక్టు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా గూడూరు`గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు`గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్‌పూర్`భద్రక్ 4వ లైన్‌కు రూ.3,352 కోట్లు, భద్రక్`హరిదాస్‌పూర్ 4వ లైన్‌కు రూ.1,583 కోట్లు, కటక్`పారాదీప్ 3, 4వ లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించార. రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. లాగే బిహార్‌లోని ముజఫర్‌పూర్`సీతామర్హి`సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.

# ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి

- ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలి
- మంత్రి పొంగులేటి



**ఖమ్మం, మన చౌరాస్తా :** గ్రామీణ ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ పల్లెల ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా కూసుమంచి మండలం క్యాంప్ కార్యాలయంలో అర్హులైన 12 మంది దివ్యాంగులకు వందశాతం సబ్సిడీపై మూడు చక్రాల మోటార్ వాహనాలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నాను. రూ. 61.76 కోట్లతో ప్లలెగూడెంలో సీసీ, బీటీ రోడ్లతో పాటు వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పల్లెగూడెంలో ప్రభుత్వ మరియు అసైన్డ్ భూములను ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలి. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడం జరిగింది. అదేవిధంగా గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షల నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సభలో పింఛన్లు కావాలని అడిగిన మహిళలకు నెల 31వ తేదీలోగా అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.



# సినిమా టిక్కెట్లపై కీలక ఆదేశాలు

- థియేటర్ స్క్రీన్స్ ఆధారంగా రేట్లు
- ఐదు షోలకు అనుమతి.. ఆదాయంలో కార్మికులకు వాటా

**హైదరాబాద్, మన చౌరాస్తా:** తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై ప్రభుత్వం కీలక జీవో జారీ చేసింది. కొత్తగా స్పెషల్ థియేటర్స్ కేటగిరీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 7.1 సౌండ్, 2కె/4కె స్క్రీన్లకు స్పెషల్ కేటగిరీ వర్తించనుంది. ప్రతి థియేటర్‌లో 25 శాతం నాన్`ప్రీమియం సీట్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు 5 షోలకు అనుమతి ఇచ్చింది. చిన్న సినిమాలకు ప్రతి రోజు ఒక షో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. రూ.100 కోట్లు పైబడిన సినిమాలకు ప్రభుత్వం సూపర్ హై బడ్జెట్ హోదా కల్పించింది. తొలి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం కల్పించింది. టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత శాతాన్ని కార్మికుల సంక్షేమ నిధికి విరాళంగా ఇవ్వాలని షరతు పెట్టింది. కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి వరకు విరాళం తప్పనిసరి చేసింది.



## 24న మహాకాళి

# ఫస్ట్ గ్లింప్స్

పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సురేశ్ రఘు సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హనుమాన్ సినిమాతో సూపర్‌హీరో కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, 'మహాకాళి'తో ఏ స్థాయి విజువల్ ట్రీట్ ఇస్తారోనని సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**